

ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక బోధన..

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 8లో



గ్రామీణ రైతుల ఆధునిక సేద్యం

గ్రామీణ ప్రాంత రైతులు ఆధునిక యంత్రాలతో సేద్యం చేస్తున్నారు. డ్రోన్‌ల సాయంతో పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత తక్కువగానే నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

- భక్తులతో భద్రగిరి కిటకిట



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరా ధన తదితర పూజలు చేశారు. అనంతరం కల్యాణ మూర్తులను మేళ తాళాల నడుమ చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంక ణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యక ల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. నిత్యకల్యాణ వేడుకలో 80కి పైగా భక్త దంపతులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

భద్రాద్రి రామాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులతో పాటు వారాంతపు సెలవు రోజులు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివ చ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులుదీరారు. ఆర్జిత సేవల్లోనూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అటవీ అభ్యంతరాలతో నిలిచిన రోడ్లు

- నిర్మాణానికి అనుమతి ఇవ్వండి
- అటవీ శాఖ మంత్రిని కోరిన తుమ్మల



అనుమతి రాక నిలిచిపోయిన వీరాపురం - గుండాల రోడ్డు

ఇల్లెందు : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆదివాసీ, ఏజెన్సీ గ్రామాలకు కనీస రహదారులు లేక ప్రజలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. అటవీ శాఖ అభ్యంతరాలతో పలు కీలక రోడ్ల నిర్మా ణాలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ రోడ్లకు అనుమతులు సాధించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలు రోడ్లకు అనుమతు లు సాధించారు. తాజాగా మరికొన్ని రోడ్లకు అనుమతులు ఇవ్వాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు పీసీసీఎఫ్‌ను కోరారు. 2018 – 19 సంవత్సరంలో ఎల్‌డబ్ల్యూఈ ఫేస్ –1, 3 కింద పలు రహదారులు మంజూరైనా అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయా యని తుమ్మల వారి దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో గుండాల – పస్రా, వీరాపురం – గుండాల, పెద్ద మిడిసిలేరు – బత్తినపల్లి రాచన్నగూడెం వయా పూసుకుంట, ఆళ్లపల్లి – పెద్ద వెంకటాపురం, లక్ష్మీనగర్ – లక్ష్మీపురం, అడివిరామవరం – దొంగతోగు, సాయనపల్లి – అడివిరామవరం, ఎర్రంపాడు – ఆర్‌సీ పురం, దేవరపల్లి – కొరకటపాడు, కొరక టపాడు – బక్క చింతలపాడు, కొత్తపల్లి – గద్దె మడుగు, కిష్టాపురం – పిట్టతోగు, కుర్నపల్లి – నిమ్మలగూడ, బత్తినిపల్లి – కురుమపల్లి తదితర రహదారులు ఉన్నాయని వివరించారు.

గాడిన పడేదెప్పుడో ?

అడ్రస్ లేకుండాపోయిన కాజీపేట ప్యాసింజర్

- తరచూ రద్దవుతున్న బెళగావి, విజయవాడ రైళ్లు
- మూడో లైన్ నిర్మాణం, ట్రాక్ రిపేర్లతో చిక్కులు
- గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న మిగితా ట్రెయిన్లు

మూడో లైన్ నిర్మాణం, ట్రాక్ మరమ్మతుల పేరుతో రైళ్లు రద్దవుతుండడంతో వేసవిలో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. ఎప్పుడు ఏ రైలు నడుస్తుందో, ఎప్పుడు ఏ రైలు రద్దవుతుందో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధుల నిర్వాకం కార ణంగానే ఈ పరిస్థితులు వచ్చాయని, కనీసం త్వరలో ఎన్నికయ్యే వారైనా ఈ విషయంపై దృష్టి పెట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



తగ్గిన రైళ్లు..

ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న భద్రాద్రి జిల్లాకు ఇప్ప టికీ రైలు సౌకర్యం అరకొరగానే ఉంది. అది కూడా కొత్తగూడెం కేంద్రంగానే ఎక్కువ రైళ్లు నడుస్తున్నాయి. కరోనా సంక్షోభానికి ముందు కొత్తగూడెం (భద్రాచలం రోడ్) స్టేషన్ నుంచి విజయవాడ, డోర్నకల్, బల్లార్షా, కాజీపేటలకు ఒక రైలు, హైదరాబాద్‌కు మణుగూరు సూప ర్‌ఫాస్ట్, కొల్హాపూర్, కాకతీయ రైళ్లు నడి చేవి. కరోనా తర్వాత డోర్నకల్, కాజీ పేట రైళ్లను ఇప్పటికీ పునరుద్ధరించ లేదు. కొల్హాపూర్ రైలు స్థానంలో బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశ పెట్టారు. అయితే పునరుద్ధరిం చిన రైళ్లు సైతం ఎప్పుడు నడు స్తాయో, ఎప్పుడు నడవవో తెలియని పరిస్థితి నెలకొంది.

వేసవి సెలవులతో రద్దీ..

గత నెల రోజులుగా విద్యాల యాలకు వేసవి సెలవులు కొన సాగుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున ప్రయాణాలు జరుగుతు న్నాయి. అయితే కొత్తగూడెం మీదుగా వెళ్తున్న రైళ్లు రద్దు కావడం ప్రజలకు ఇబ్బం దిగా మారింది. మరో రెండు వారాల్లో విద్యాల యాలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేప థ్యంలో రద్దయిన రైళ్లను నడిపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం నడుస్తున్న రైళ్లు ఎప్పుడు సమయపా లన పాటిస్తాయో, ఎప్పుడు పాటించవో తెలియని గందరగోళం నెలకొంది. గత మూడు దశాబ్దాలుగా చూస్తే సింగరేణి రైలు సమయపాలన పాటించడమే లేదు. నూటికి 90 రోజులు ఆలస్యంగానే నడుస్తోంది. ఇప్పుడు దీనికి కాకతీయ ఎక్స్‌ప్రెస్ కూడా తోడ యింది. మరోవైపు రాత్రి 11:30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదే రాల్సిన మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వారంలో సగం రోజులు గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరుతోంది. దీంతో అర్ధరాత్రి వేళ రాష్ట్ర రాజధానిలోని ప్రధాన స్టేషన్‌లో జిల్లాకు చెందిన ప్రయాణికులు పిల్లా పాపలతో ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకెన్నాళ్లిలా..

నాలుగేళ్ల క్రితం కరోనా, ఇప్పుడు మూడో లైన్ నిర్మాణం పేరుతో ఇష్టారీతిగా రైళ్లను రద్దు చేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ – నెక్కొండ మధ్యనే మూడో లైన్ నిర్మాణం పూర్త యింది. నెక్కొండ – మహబూబా బాద్ – డోర్నకల్ మధ్య ట్రాక్ నిర్మాణ పనులు ఇప్పుడే మొదలయ్యాయి. మరోవైపు భద్రాచ లం రోడ్ – డోర్నకల్ సెక్షన్‌లో రెండో లైన్, డోర్నకల్ – ఖమ్మం సెక్షన్‌లో మూడో లైన్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. దీంతో ఈ నిర్మాణ పనుల వంకతో ఎన్ని నెలల పాటు రైళ్లు రద్దు చేస్తారో తెలియడం లేదు. జిల్లాకు చెందిన ప్రజాప్రతిని ధులు రైల్వేశాఖపై ఒత్తిడి తెచ్చి రైళ్ల రద్దును అడ్డు కోవాలని పలువురు కోరుతున్నారు. రద్దు తప్ప నిసరైన పక్షంలో కనీసం హేతుబద్ధత పాటిం చాలని డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీ జిల్లాకు అరకొరగా ఉన్న కొద్దిపాటి రైలు ప్రయాణ సౌక ర్యాన్ని దూరం చేయొద్దని కోరుతున్నారు.

మూడో లైన్ పేరుతో..

రాష్ట్రంలో కీలకమైన బల్లార్షా – కాజీపేట – డోర్నకల్ – విజయవాడ మార్గంలో గత కొన్నేళ్లుగా రైల్వేశాఖ మూడో లైన్ నిర్మాణ పనులు చేపడుతోంది. ఇందులో నెక్కొండ – వరంగల్, ఖమ్మం – విజయవాడ సెక్షన్ల మధ్య మూడో లైన్ ట్రాక్ నిర్మాణం పూర్తయింది. అయితే సిగ్నలింగ్ పనులు చేపట్టాలంటూ గతేడాది కాలంగా పగటి వేళ నడుస్తున్న విజయవాడ, సింగరేణి, కాకతీయ, బెళగావి ఎక్స్‌ప్రెస్ రైళ్లను తరచుగా రద్దు చేస్తు న్నారు. ఇందులో విజయవాడ, సింగరేణి, బెళగావి రైళ్లు సాఫ్ట్ టార్గెట్‌గా మారాయి. దీంతో ఇప్పటికే విజయవాడ రైలును జిల్లా వాసులు మరిచిపోయే పరిస్థితి రాగా బెళగావి ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్‌గా నడుస్తుందనే నమ్మకం లేకుండా పోయింది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావే శంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27న పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. జిల్లా లో ఎన్నికల నిర్వహణకు 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 76 మంది పీఓలు, 76 మంది ఏపీఓలు, 160 మంది ఓపీఓలు అవసర మని తెలిపారు. జిల్లాలో 40,106 మంది పట్టభద్రు లు ఓటర్లుగా నమోదు కాగా, వారిలో 22,590 మం ది పురుషులు, 17,516 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5 ఎంసీసీ బృ ందాలతో పటిష్ట నిఘా చేపట్టాలని సూచించారు. సెక్టార్ అధికారుల నియామకం పూర్తి చేయాల న్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వసతుల కల్పనను తనిఖీ చేయాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశిం చారు. 100 శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేయా లన్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశారని, రిసెప్షన్ కేంద్రం నల్లగొండలో ఉంటుందని చెప్పారు. అనంతరం ధరణి, మీ సేవ, ప్రజావాణి, అమ్మ ఆదర్శ కమిటీ పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఆర్డీఓలు మధు, దామోద ర్‌రావు, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీటీ రంగాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షకు 21 కేంద్రాలు..

జూన్ 9న జరగనున్న గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలె క్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మాట్లా డుతూ.. జిల్లాలో 8,875 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నా రని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అనం తరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. పరీక్ష రోజు ఉదయమే తగిన భద్రత మధ్య ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఒక ప్రధాన గేట్ ద్వారానే కేంద్రంలోకి పంపించాలని సూచించారు. తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమ తించాలన్నారు. జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష జరుగుతుందని, 9 గం టల నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిం చాలని, 10 గంటలకు ప్రధాన గేట్లు మూసివేయా లని సూచించారు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ నిర్వ హించాలని, పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిం చాలని తెలిపారు. టీజీపీఎస్సీ నిబంధనలకు అను గుణంగా పరీక్ష జరిగేలా చూడాలన్నారు. దివ్యాంగు లు, అంధ అభ్యర్థులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం అదనపు కలె క్టర్ వేణుగోపాల్, టీజీపీఎస్సీ రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహన్‌రాజుతో కలిసి కలెక్టరేట్‌లో ఉన్న స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు.

టీఎస్ స్థానంలో టీజీ

ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు టీఎస్‌కు బదులు ఇకపై టీజీగా మార్చాలని కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కేంద్రం గెజిట్ జారీ చేసిందని పేర్కొ న్నారు. వాహనాల రిజిస్ట్రేషన్లకు గత మార్చిలోనే అనుమతి రాగా, అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీజీగా మార్చుతూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. టీజీగా మార్చుతూ తీసుకునే చర్యలపై అన్ని శాఖల అధికారులు ఈనెల 25 లోగా నివేదికలు అం దజేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

కొత్తగూడెంఅర్బన్: న్యాయపరమైన ఆటంకాలు తొలగిపో యినందున గతేడాది అక్టోబర్‌లో అర్ధంతరంగా నిలిపివేసిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరే షన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. శనివారం టీచర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కిషోర్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరే ళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతోందని అన్నారు. విద్యాశాఖ కమిషనర్ దేవ సేన నిర్లక్ష్యంతోనే పదోన్నతుల్లో అవాంతరాలు ఏర్పడ్డాయ న్నారు. గురువారం యూఎస్పీసీ, జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చర్చలు జరిపారని, ఈ సందర్భంగా ఎన్నికల సంఘం అనుమతితో పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని సత్వరమే అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణలో సైతం విద్యాశాఖ అసమర్థత వెల్లడైందన్నారు. భద్రాద్రి జిల్లా నుంచి దరఖాస్తు చేసిన వారికి హైదరాబాద్, మెదక్ జిల్లా నుంచి అప్లై చేసినవారికి ఖమ్మంలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, కోశాధికారి ఎస్.వెంకటే శ్వర్లు, జిల్లా కార్యదర్శులు రాజయ్య, బిక్కు, నాయకులు శం కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్


కొత్తగూడెంటౌన్ : జిల్లా కోర్టులో జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని, ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులు, ఇన్సూ రెన్స్ కంపెనీ న్యాయవాదులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. బీమా కంపెనీ ప్రతిని ధులు కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించు కోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసుల్లో కక్షిదారులకు న్యాయం జర గాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడడంతో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవు తాయని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.శివనాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పీపీలు పోసాని రాధాకృష్ణ మూర్తి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

భద్రాచలంఅర్బన్ : ఖైదీలు సత్ప్రవర్తన అలవ ర్చుకోవాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం ఆయన భద్రాచలం సబ్ జైలులో ఖైదీలతో ముఖాముఖిగా మాట్లాడారు. జైలు జీవితంలో లభించే విరామ సమయంలో గతంలో చేసిన తప్పులను గుర్తు చేసుకుంటూ నేర ప్రవృత్తికి దూరం కావాలని, కుటుంబం కోసం జీవించేలా పరివర్తన చెందాలని సూచిం చారు. జైలులో ఖైదీలకు అందుతున్న వసతు లపై ఆరా తీశారు. కార్యక్రమంలో భద్రాచలం కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కె. సూరిరెడ్డి, సబ్ జైల్ అధికారి ఉపేందర్, టౌన్ సీఐ సంజీవ రావు పాల్గొన్నారు.

అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

- జెడ్పీ సమావేశంలో చైర్మన్ కంచర్ల, ఎమ్మెల్యే కూనంనేని
- హాజరైన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి: అధికారులు అంకితభావంతో పనిచేస్తేనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా పరి షత్ సమావేశం అంటే అసెంబ్లీతో సమానమని, జిల్లా లోని ప్రజాప్రతినిధులు, అధికారులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారమైతే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు సమావేశాలకు హాజరుకావాలని, వారు చెప్పాలనుకునే అంశాలను ముందే క్లుప్తంగా తయారు చేసుకుని రావాలని సూచించారు. జిల్లా అధికారుల్లో పరిపాలన లోపం స్పష్టంగా కనిపిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇటీవలి వర్షాల సమయంలో విద్యుత్ శాఖలో నిర్లక్ష్యం స్పష్టమైందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులు నిబద్ధతగా పనిచేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు అధికారులకు తోడ్పాటు అందించాలన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులదేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వార్డు సభ్యుడు నుంచి ఎమ్మెల్యే వరకు కృషి చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్చేందుకు వెనుకాడుతున్నారని అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జిల్లా పరిషత్ ఉద్యోగి శ్రీకృష్ణకు సంతాపం తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



తల్లీబిడ్డలతో 108 సిబ్బంది

ములకలపల్లి: 108 వాహనంలో మహిళ ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండల పరిధిలోని వీకే. రామవరం గ్రామానికి చెందిన మిడియం లక్ష్మి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా, కుటుంబీకులు 108కు ఫోన్ చేశారు. దీంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని లక్ష్మిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్నారు. లక్ష్మికి నొప్పులు ఎక్కువ కావడంతో డాక్టర్ మనీష్, ఈఎంటీ భాగ్యమ్మ, పైలెట్ అశోక్ అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. అనంతరం వైద్యం కోసం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోలీసులమంటూ బంగారంతో ఉడాయింపు

పాల్వంచ: సినీఫక్కీలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తిని ఆపి, బంగారం లాక్కుని ఉడాయించిన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 16న పెండ్లి సంజీవరెడ్డి స్కూటీపై జగన్నాథపురం నుంచి పాల్వంచ వైపు వస్తుండగా మార్గమధ్యలో ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమని, వాహనాన్ని తనిఖీ చేయాలని అడ్డగించారు. దీంతో సంజీవరెడ్డి స్కూటీ దిగి డిక్కీ తెరుస్తుండగా బలవంతంగా మెడలో ఉన్న బంగారు గొలుసు, ఉంగరం తీసుకుని పరారయ్యారు. బంగారం వస్తువుల విలువ రూ. 1.20 లక్షలు ఉంటుంది. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోడు భూమిలో చెట్లు నరికివేత



పోడు భూమిలో నరికిన చెట్లు

అశ్వారావుపేట: మండల పరిధిలోని గుమ్మడవల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మడకం భద్రమ్మకు చెందిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూమిలో పలు అటవీ జాతుల చెట్లు నరికివేతకు గురయ్యాయి. శనివారం ఈ విషయం బయటకు వచ్చింది. మడకం భద్రమ్మకు చెందిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూమిని గుమ్మడవల్లికి చెందిన బత్తుల చిన్నోడు లీజుకు తీసుకున్నాడు. ఈ భూమిని చదును చేసే క్రమంలో 20 చెట్లు నరికివేశారు. పాల, నల్లమద్ది, తునికి, మారుజాతి చెట్లు వీటిలో ఉన్నాయి. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో కొందరు పోస్ట్ చేయగా, అటవీశాఖాధికారులు రూ.15 వేలు పెనాల్టీ విధించినట్లు సమాచారం.

కూలిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్



కిందపడ్డ విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

అశ్వారావుపేట: లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ కూలిన సంఘటన అశ్వారావుపేటలో శనివారం జరిగింది. ఖమ్మం రోడ్‌లోని బండి సుబ్రమణ్యం నగర్‌లో ఓ వీధిలోకి వస్తున్న లారీ పైకప్పునకు విద్యుత్ లైన్లను అడ్డు తగిలాయి. లారీ డ్రైవర్ గమనించకుండా వెళ్లడంతో విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయాయి. విద్యుత్ లైన్ల నుంచి నిప్పురవ్వలు వ్యాపించగా, టీవీఎస్ షోరూం వద్ద వాహనాలు నిలిపి ఉన్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోగా ట్రాన్స్‌కో సిబ్బంది పునరుద్ధరించారు.

మహిళ ఆత్మహత్య

పాల్వంచ: మహిళ ఆత్మహత్య ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దంతెలబోర గ్రామానికి చెందిన మడకం సోని(34) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక బోధన..

- జిల్లాలో 7,345 మంది విద్యార్థులు ఇంటర్ ఫెయిల్
- వారి కోసం కళాశాలల్లో, ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 9వ స్థానం కైవసం చేసుకుంది. అయినప్పటికీ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా ముఖ్యమైన ప్రశ్నలు చదివించడం, వారి చేత రాయించడం వంటివి చేయిస్తున్నారు. వేసవి సెలవులు ఉన్నప్పటికీ విద్యార్థులు వారి ప్రాంతాల్లోని ప్రభుత్వ కళాశాలకు వచ్చే వారికి బోధన చేస్తున్నారు. మిగతా వారికి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని అధ్యాపకులు వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 9,291 మంది పరీక్ష రాయగా 6,556 మంది ఉత్తీర్ణత సాధించారు. 2,735 మంది ఫెయిల్ అయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 10,206 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5,596 మంది ఉత్తీర్ణత సాధించగా, 4,610మంది ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,345 మందికి జిల్లాలోని 14 ప్రభుత్వ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే వేసవి సెలవుల కారణంగా విద్యార్థులు పూర్తిస్థాయిలో ప్రత్యేక క్లాసులను వినియోగించుకోలేకపోతున్నారు. కాగా ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షల ముందు రోజు వరకు కూడా కళాశాలల్లో, ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయి. విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టుల్లో అధ్యాపకుల సూచనలు, సలహాలు తీసుకుని, బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలి.

– సులోచనారాణి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

కోచింగ్ సెంటర్ లేక..

జిల్లాలో 14 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏటా ఎంసెట్, నీట్, జేఈఈ వంటి పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేవారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా విడిపోయినప్పటి నుంచి జిల్లాకు కోచింగ్ సెంటర్ మంజూరు కాలేదు. దీంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలల్లో సీనియర్ అధ్యాపకులుండి కూడా వారిని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కళాశాలల్లో కోచింగ్ ఇవ్వడానికి అన్ని సదుపాయాలున్నప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని, ఇంటర్మీడియట్ బోర్డు కోచింగ్ సెంటర్ మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

పిడుగుపాటుతో రైతు మృతి

మధిర: మండలంలోని రామచంద్రాపురానికి చెందిన రైతు సంపసాల కృష్ణ (55) శనివారం పిడుగుపాటుతో మృతి చెందాడు. పశువులను మేపేందుకు పొలానికి వెళ్లగా వర్షం కురుస్తుండటంతో ఆయన చెట్టు కింద నిలబడ్డాడు. కృష్ణతో పాటు మరో ముగ్గురు రైతులు ఉండగా, పిడుగుపాటుకు కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

కూసుమంచి: జుజుల్‌రావుపేట సమీపాన ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కరివిరాల గ్రామానికి చెందిన దుంపటి ఉపేందర్ (40)బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

కిరాతకుడు..

ఆస్తి కోసం కన్నతల్లి దారుణహత్య

- కన్నబిడ్డలనూ వదలని దుర్మార్గుడు
- తల్లి దివ్యాంగురాలనే కనికరమూ చూపని వైనం
- అన్నం తినేందుకు వస్తున్నానని చెప్పి హతమార్చిన నిందితుడు
- తల్లాడ మండలం గోపాలపేటలో దారుణం



పిచ్చమ్మ, నీరజ, ఝాన్సీ మృతదేహాలు

మానవత్వం మంట గలిసింది.. చెడు తిరుగుళ్లు, మద్యానికి బానిసైన వ్యక్తి ఆస్తి మొత్తం దక్కించుకోవాలనే పన్నాగంతో కన్నతల్లినే కాదు రక్తం పంచుకుని పుట్టిన ఇద్దరు కుమార్తెలనూ హత్య చేశాడు. కుటుంబంలో మిగిలిన వీరిని చంపితే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందనే భావనతో దివ్యాంగురాలైన తల్లినే కాక అభం శుభం తెలియని ఇద్దరు పిల్లలను గొంతు నులిమి హతమార్చాడు. అన్నం తినేందుకు వస్తున్నానని చెప్పిన కుమారుడి కోసం ఎదురుచూస్తూ నిద్రలోకి జారుకున్న తల్లి.. తండ్రి వస్తున్నాడని ఆశగా చూసిన పిల్లలకు అదే చివరిరాత్రి అయింది. తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ దారుణానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. – తల్లాడ

● అనుమానాస్పదంగా మొదటి భార్య మృతి

తల్లాడ మండలం గోపాలపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల వెంకటేశ్వర్లుకు 12 ఏళ్ల క్రితం రంగంబంజరకు చెందిన కనకదుర్గతో వివాహమైంది. వీరికి నీరజ (11), ఝాన్సీ (6) జన్మించారు. రెండేళ్ల కిందట కనకదుర్గ గ్రామంలో వారికి కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇంట్లో మృతి చెందింది. అప్పట్లో భర్త వెంకటేశ్వర్లుపై దుర్గ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నందున గ్రామంలోని ఎకరం భూమిని ఇద్దరికి చెరో పది కుంటల చొప్పున, వెంకటేశ్వర్లు తల్లి పిట్టల పిచ్చమ్మ (60) పేరిట 20 కుంటల భూమిని పెద్దలు రాయించారు. అలాగే, డబుల్ బెడ్ రూమ్, పాత ఇల్లు కూడా ఇద్దరు పిల్లలు పేరు మీదే రాయించి ఎలాంటి కేసు లేకుండా దుర్గ అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆపై వెంకటేశ్వర్లు గ్రామం నుంచి వెళ్లిపోయి నాలుగు నెలల అనంతరం తల్లాడకు చెందిన బూదె త్రివేణిని రెండో వివాహం చేసుకుని ఖమ్మంలో ఉంటున్నాడు.

● స్థలం కోసం వేధింపులు

రెండో పెళ్లి చేసుకున్న వెంకటేశ్వర్లు తరచుగా తల్లి వద్దకు వచ్చి అర ఎకరం భూమి పాస్ పుస్తకం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నాడు. అంతేకాక ఇల్లు కూడా తన పేరిట రాయాలని కోరగా ఆమె నిరాకరించింది. చివరకు తల్లితో బలవంతంగా సంతకాలు చేయించుకున్నాడు. ఈ విషయం గ్రామస్తులు, బంధువులకు తెలియడంతో ఆయనను మందలించి భూమి, ఇళ్లు కూడా పిల్లలు, తల్లికి చెందేలా ఈ ఏడాది జనవరిలో తిరిగి అగ్రిమెంట్ రాయించారు. అప్పటి నుంచే వెంకటేశ్వర్లు తన తల్లిపై కక్ష పెంచుకున్నాడు.

● చంపేస్తే ఆస్తి వస్తుందని..

ఆస్తి తనకు దక్కకుండా అడ్డుగా ఉన్న తల్లి, ఇద్దరు కుమార్తెలను చంపితే ఆస్తి దక్కించుకోవచ్చని వెంకటేశ్వర్లు భావించినట్లు తెలుస్తోంది. ఇందుకు రెండో భార్య త్రివేణి కూడా ప్రోత్సహించినట్లు సమాచారం. ఈ మేరకు ఖమ్మంలో ఉంటున్న వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి తన పక్కింటి వారికి ఫోన్ చేసి తల్లితో మాట్లాడి గ్రామానికి వస్తున్నట్లు చెప్పాడు. అన్నం కూడా వండాలని చెప్పగా ఆమె సరేనంది. ఆపై కాసేపు వేచి ఉన్న పిచ్చమ్మ, పిల్లలు ఎంతకూ వెంకటేశ్వర్లు రాకపోయే సరికి నిద్రించారు. అర్ధరాత్రి దాటాక అందరూ నిద్రిస్తున్న సమయాన గ్రామానికివచ్చిన ఆయన ఇంటికి గడియ పెట్టి తల్లి పిచ్చమ్మను కొట్టి చంపాడు. ఆ తర్వాత గాఢ నిద్రలో ఉన్న ఇద్దరు కుమార్తెలు నీరజ, ఝాన్సీలను గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం ఏమీ ఎరగనట్లుగా తలుపులు వేసి పరారయ్యాడు. అయితే, తెల్లవారినా పిచ్చమ్మ, పిల్లలు బయటకు రాకపోవడంతో ఇరుగు పొరుగు వారికి అనుమానం వచ్చి చూడగా విగతజీవులుగా పడి ఉన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. ఆస్తి కోసం వెంకటేశ్వర్లే కన్నతల్లి, ఇద్దరు కుమార్తెలను హత్య చేసినట్లు పిల్లల మేనమామ కొప్పెర మరళీకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గోపాలపేటలో విచారణ చేస్తున్న ఏసీపీ రెహమాన్, పోలీసులు

హైవే పనులను అడ్డుకున్న రైతులు

ముదిగొండ: ముదిగొండలోని ఊరచెర్వు తూము వద్ద మినీ అండర్‌పాస్ ఏర్పాటు చేయకుండా జాతీయ రహదారి పనులు చేస్తున్నారని రైతులు శనివారం అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. కనుమరుగైన చెర్వు తూమును వెలికితీసి వర్షం నీరు వెళ్లేలా మినీ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు ఈఈ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. దీంతో నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఈఈ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

ప్లాంటేషన్‌లో మొక్కలు నరికిన వారిపై కేసు

కారేపల్లి: కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి ఊట్కూర్ నార్త్ బీట్‌లోని అటవీ ప్లాంటేషన్‌లో శనివారం ఎర్రబోడుకు చెందిన 20 మంది మొక్కలు, పొరకను నరికివేశారు. నలభై హెక్టార్లోని ప్లాంటేషన్‌లోకి చొరబడిన వ్యక్తులు సుమారు ఐదెకరాల మేర మొక్కలను ధ్వంసం చేశారని కారేపల్లి ఫారెస్టు రేంజ్ అధికారి సిద్ధార్థ్‌రెడ్డి తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేయడమే కాక చట్టపరమైన చర్యలకు కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ప్రజలు అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలే తప్ప చట్టవ్యతిరేక పనులకు దిగి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

చండ్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి పంచాయతీ శివారు మహ్మద్‌నగర్‌లో శనివారం ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్కే బడేమియా ఇంట్లో సర్వీస్ వైర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రామస్తులు చూస్తుండగానే ఇల్లంతా కాలిబూడిదైంది. ఇంట్లోని టీవీ, మంచాలు, దుస్తులు, సామగ్రి, రూ. 20 వేల నగదు కాలిపోయిందని, రూ. 80 వేల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పశువులు పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సరిహద్దున ఉన్న తోటపల్లి నుంచి శనివారం బూర్గంపాడు మండలం సారపాకకు ఓ ట్రాలీలో ఐదు పశువులను తరలిస్తుండగా పట్టణంలోని ఫారెస్టు చెక్ పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించి, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

కరకగూడెం: మండలంలోని కలవల నాగారం గ్రామ పరిధి అటవీ ప్రాంతంలో ఉన్న సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. 10 లీటర్ల నాటు సారా, బెల్లం, పానకం స్వాధీనపర్చుకొని ధ్వంసం చేశారు. సారా తయారీదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

బైక్‌లు ఢీకొని బయటపడ్డ గంజాయి

మోటార్ సైకిల్, గంజాయి వదిలి ఇద్దరు యువకుల పరార్



స్థానికులు గుర్తించిన గంజాయి ప్యాకెట్లు

బూర్గంపాడు: రెండు బైక్‌లు ఢీకొని ప్రమాదం జరగడంతో మోటార్ సైకిల్, గంజాయిప్యాకెట్లు వదిలి ఇద్దరు వ్యక్తులు పరారైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... భద్రాచలం వైపు నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో సారపాక ప్రధాన కూడలిలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టారు. దీంతో వారి బైక్‌పై ఉన్న బ్యాగ్ కింద పడిపోయింది. అయితే ఆ ఇద్దరు బ్యాగ్ తీసుకోకుండా, మోటార్ సైకిల్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. మరో మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి, స్థానికులు బ్యాగు తెరిచి చూడగా అందులో సుమారు 4 కిలోల బరువు కలిగిన రెండు గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. స్థానికులు పరారైన యువకుల కోసం కొద్ది దూరం వెంబడించగా, వారు రూట్ మార్చి తప్పించుకున్నారు. గంజాయి దొరికిన విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భద్రాచలం వైపు నుంచి వస్తున్న గంజాయి స్మగ్లర్లు తమను వెనుక నుంచి ఎవరో అనుసరిస్తున్నట్లు అనుమానం రావటంతో వేగంగా బైక్ నడుపుతుండగా, ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. అంతకుముందు మరో బైక్‌ను ఢీకొట్టి వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి



దూయి హుంగా మృతదేహం, పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. సుకుమా ఎస్పీ కిరణ్‌చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గస్‌పైర్ తొన్లాయ్, టెట్రాయ్ గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా వారికి మావోయిస్టులు తారస పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా దూయి హుంగా అనే మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. అతడిపై వివిధ జిల్లాల్లో 16కు పైగా కేసులు నమోదయ్యాయని, రూ.లక్ష రివార్డు ఉందని ఎస్పీ వివరించారు.

బస్సు నుంచి జారి పడి మహిళ దుర్మరణం

రద్దీతో తలుపు వద్ద నిలబడగా ఘటన



అనూష (ఫైల్)

కొణిజర్ల: ఆర్టీసీ బస్సులో తలుపు వద్ద నిలుచున్న వివాహిత ప్రమాదవశాత్తు జారి వెనుక టైరు కింద పడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన దూరి అనూష (26) ఖమ్మంలోని డీమార్ట్‌లో పనిచేస్తోంది. శనివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు కొణిజర్లలో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కింది. అప్పటికే ప్రయాణికుల రద్దీ ఉండటంతో ఆమె డోర్ వద్ద నిలబడింది. బస్సు ఎంపీడీఓ కార్యాలయం సమీపానికి రాగానే మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ యత్నించాడు. ఇంతలోనే ఎదురుగా ద్విచక్రవాహనం రాగా డ్రైవర్ బ్రేక్ వేయడంతో తలుపు వద్ద నిలబడిన అనూష జారి రోడ్డుపై పడింది. అప్పటికే బస్సు కదలడంతో వెనుక టైరు ఆమె పైనుంచి వెళ్లగా నడుము భాగం నుజ్జునుజ్జయి ఘటనా స్థలిలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త అశోక్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం పనిచేస్తున్న ఆమె మృతి చెందిందనే సమాచారంతో కుటుంబీకులు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. కాగా, అనూష మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఖమ్మం డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు

పెనుబల్లి: వరుస వర్షాల నేపథ్యాన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని ఖమ్మం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచించారు. ఆస్పత్రుల్లో కావాల్సిన మందులు, పరికరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమకూరుస్తామని తెలిపారు. కాగా, ఆస్పత్రి నిర్వహణ, చికిత్స విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అగ్రిమెంట్ ప్రకారం భవన నిర్మాణం నెలలలోగా పూర్తి కావాల్సి ఉన్నా అలా లేదని చెప్పారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

మధిర: మండలంలోని రొంపిమళ్ల గ్రామంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ రాజేశ్ (42) శుక్రవారం మృతి చెందాడు. కూలీ పనికి వెళ్లిన ఆయన సిమెంట్ బొంగును పైకి ఎత్తుతుండగా ప్రమాదవశాత్తు అది మీద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిట్ దర్యాప్తు ముమ్మరం

- దాడులు జరిగిన తీరు, పోలీసులు చేపట్టిన చర్యలపై సమీక్ష
- డీజీపీతో సిట్ చీఫ్ బ్రిజ్‌లాల్ భేటీ
- అనంతరం సిట్ బృందాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- సస్పెండ్ అయినా అనంతపురంలో ఆ అధికారిదే హవా!
- పరోక్షంగా ఆయన ఆధ్వర్యంలోనే రికార్డుల రూపకల్పన!
- రేపు ఈసీకి ప్రాథమిక నివేదిక సమర్పించనున్న సిట్
- పూర్తి స్థాయి విచారణకు గడువు కోరే అవకాశం

దాడులు, దౌర్జన్యాలపై సిట్ విచారణ

అనంతపురం, పల్నాడు, తిరుపతి జిల్లాలకు సిట్ బృందాలు


తాడిపత్రిలో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద విచారణ జరుపుతున్న సిట్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలింగ్ అనంతరం హింసాత్మక సంఘటనలపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రంగంలోకి దిగింది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో దాడులు, అల్లర్ల పూర్వాపరాలు విచారిస్తూ ఆ ఘటనలపై కేసులు నమోదు చేసిన తీరును విశ్లేషిస్తోంది. ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ ఒత్తిడితో ఈసీ హడావుడిగా డీఐజీలు, ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులను బదిలీ చేసిన పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోనే పోలింగ్ రోజున, అనంతరం భారీగా విధ్వంసకాండ చెలరేగడం తెలిసిందే. వీటిపై ఏర్పాటైన సిట్‌కు నేతృత్వం వహిస్తున్న అదనపు డీజీ వినీత్ బ్రిజ్‌లాల్ తమ అధికారులను మూడు బృందాలుగా విభజించి శనివారం ఉదయానికే పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాలకు పంపారు. మరోవైపు ఆయన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో శనివారం సమావేశమై సిట్ కార్యాచరణ గురించి చర్చించారు. అనంతరం ఆ మూడు జిల్లాల్లో విచారణ చేపట్టిన పోలీసు అధికారుల బృందాలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏఏ అంశాలపై దృష్టి సారించాలనే అంశాన్ని వారికి స్పష్టం చేశారు. దాంతో పల్నాడు, అనంతపురం జిల్లాల్లో దాడులు సంభవించిన ప్రాంతాల్లో సిట్ సభ్యులు పర్యటించారు. గురజాల, మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, తాడిపత్రి పోలీసు స్టేషన్లల్లో పోలీసు అధికారులను విచారించారు. దాడులు సంభవించిన తీరు, సమాచారం అందిన వెంటనే పోలీసు అధికారులు స్పందించిన తీరు, నమోదు చేసిన కేసులు, అందులో పేర్కొన్న సెక్షన్లు తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఎఫ్ఐఆర్ కాపీలు, కేసు ఫైళ్లు, దాడులకు సంబంధించిన వీడియో రికార్డింగులను పరిశీలించారు. దాడుల తీవ్రతను అంచనా వేసి, ఆ మేరకు తగిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారా.. లేక తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారా.. అనే కోణాల్లో కూడా విచారణ కొనసాగిస్తున్నారు.

దాదాపు అన్నీ నాన్ బెయిలబుల్ సెక్షన్లే

ఆయా జిల్లాల్లో జరిగిన దాదాపు అన్ని సంఘటనల్లోనూ హత్యాయత్నం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం తదితర నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు సిట్ బృందాలు గుర్తించినట్టు సమాచారం. 144 సెక్షన్ అమలులో ఉన్నా సరే అంత మంది ఎలా గుమిగూడగలిగారు? మాచర్ల నియోజకవర్గంలో పక్కా పన్నాగంతో దారి కాచి మరీ ఎలా దాడులు చేయగలిగారు? ఎలా వెంటపడి తరమగలిగారు? తాడిపత్రిలో వందలాది మంది ఒకేసారి వచ్చి ఎలా రాళ్ల దాడి చేయగలిగారు..? అనే కోణాల్లో సిట్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం. సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల్లో దాడుల బాధితులు రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గుడిలో ఆశ్రయం పొందాల్సినంత పరిస్థితి ఎందుకు ఏర్పడింది.. దీనిపై పోలీసులకు సమాచారం ఉందా లేదా.. పోలీసులు ఆ బాధితులకు అండగా నిలబడేందుకు వెంటనే గుడి వద్దకు ఎందుకు వెళ్లలేకపోయారు.. అనే కోణాల్లో సిట్ అధికారులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది. సమస్యాత్మక, అతి సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద ఈసీ మార్గదర్శకాల మేరకు బందోబస్తుపై సిట్ అధికారులు సమీక్షించారు. ఆ కేంద్రాల వద్ద తగినంతగా కేంద్ర బలగాలను మోహరించలేదనే విషయాన్ని సిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. కాగా, ఎన్నికల సందర్భంగా హింసాత్మక సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందుగానే నేర చరిత్ర కలిగిన వారిపై చేపట్టిన చర్యల గురించి సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పీడీ యాక్ట్ కింద కేసుల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించారా.. అనే కోణంలోనూ విచారిస్తున్నారు. దాడులు అరికట్టడంలో వైఫల్యం చెందారని ఈసీ సస్పెండ్ చేసిన, బదిలీ చేసిన అధికారులను కూడా సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వారి వివరణను కూడా నమోదు చేస్తారు.

రేపు ప్రాథమిక నివేదిక

ఇంతటి సున్నితమైన అంశంపై కేవలం రెండు రోజుల్లోనే ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఈసీ ఆదేశించడంతో సిట్‌కు సమయం చాలా తక్కువగా ఉంది. దాంతో సోమవారం ఉదయం తొలుత ప్రాథమిక నివేదికను ఈసీకి సమర్పించాలని భావిస్తోంది. దాడులు జరిగిన తీరు, వాటిపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి ఈ ప్రాథమిక నివేదికలో పొందు పరచనుంది. పూర్తి స్థాయిలో విచారణకు మరింత సమయం కావాలని కోరే అవకాశాలున్నాయి. సిట్ ప్రాథమిక నివేదిక పరిశీలించిన అనంతరం ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఈసీ బదిలీ చేసినా ఆయనదే పెత్తనమా!?

హింసాత్మక సంఘటనలను కట్టడి చేయడంలో విఫలమయ్యారని ఈసీ బదిలీ చేసిన కొందరు ఉన్నతాధికారులు ఇంకా ఆ జిల్లాలో ప్రభావం చూపిస్తుండటం విస్మయపరుస్తోంది. అనంతపురం జిల్లాల్లో ఈసీ సస్పెండ్ చేసిన ఓ అధికారే ప్రస్తుతం సిట్ దర్యాప్తు కోసం సమర్పించిన రికార్డుల వ్యవహారాలను పర్యవేక్షిస్తుండటం గమనార్హం. పోలీసు రికార్డుల విభాగంలో అత్యంత వివాదాస్పద డీఎస్పీ స్థాయి అధికారి అందుకు సహకరిస్తుండటం పోలీసుశాఖలో చర్చనీయాంశమైంది. దాడులను అరికట్టడంలో ఎవరైతే విఫలమయ్యారని ఈసీ భావించిందో.. ఆ అధికారి కనుసన్నల్లోనే సిట్ పరిశీలనకు అవసరమైన రికార్డులు సమర్పిస్తే పారదర్శకత, నిష్పాక్షికత ఎక్కడ ఉంటుందని అధికార వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంపై పోలీసులే దాడి చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా విరుచుకుపడటం గమనార్హం. దీన్ని ఈసీ తీవ్రంగా పరిగణించి, అందుకు బాధ్యులైన అధికారిని బదిలీ చేసి.. సిట్ విచారణకు ఆదేశించింది. కాగా ఆ అధికారే సిట్ దర్యాప్తునకు అవసరమైన రికార్డులను పరోక్షంగా రూపొందిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది. మరి దీనిపై సిట్, ఈసీ ఎలా స్పందిస్తాయన్నది చూడాలి. ఇదిలా ఉండగా సిట్ అధికారులు ఆదివారం తిరుపతిలో పర్యటించనున్నారు. అల్లర్లు సంభవించిన ప్రాంతాల్లో పర్యటిస్తారు. దాడులు చెలరేగినప్పుడు పోలీసులు తీసుకున్న చర్యలను సమీక్షిస్తారు.

ఎన్ని కేసులు.. ఎంత మంది అరెస్ట్?

నరసరావుపేట/రెంటచింతల/తాడిపత్రి: ఏసీబీ అదనపు ఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలోని సిట్ బృందం శనివారం నరసరావుపేటలో పర్యటించింది. మధ్యాహ్నం మూడు గంటలకు నరసరావుపేట చేరుకున్న బృందం నేరుగా టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించింది. ఆ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసుల వివరాలను అధికారులు పరిశీలించారు. సీఐ భాస్కర్‌తో చర్చించారు. ఎవరెవరిపై కేసులు నమోదు చేశారు.. ఎవరిని అరెస్టు చేశారు.. దర్యాప్తు ఎంతవరకు వచ్చింది.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహంపై దాడిచేసి ఇద్దరిని గాయపర్చి మూడుకార్లు ధ్వంసంపై నమోదైన కేసు, బాలికోన్నత పాఠశాలలో ఏజెంట్లుగా కూర్చున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గంటెనపాటి గాబ్రియేలు, గోపిరెడ్డి డ్రైవర్ హరిపై టీడీపీ అభ్యర్థి అరవిందబాబు, అతని అనుచరులు చేసిన దాడి కేసు, అరవిందబాబు కారుపై జరిగిన దాడి కేసు, మల్లమ్మసెంటర్‌లో బొలేరో వాహనాన్ని తగులబెట్టిన కేసు, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో పమిడిపాడు, దొండపాడు గ్రామాల్లో జరిగిన సంఘటనలపై నమోదైన కేసుల వివరాలను ఆయా స్టేషన్ పోలీసుల నుంచి సేకరించారు. రబ్బరు బుల్లెట్లతో ఎందుకు ఫైరింగ్ చేయాల్సి వచ్చిందో వివరణ తీసుకున్నట్లు తెలిసింది. కాగా, ఇద్దరు సిట్ బృందం అధికారులు శనివారం రాత్రి రెంటచింతల పోలీసు స్టేషన్‌కు వచ్చి రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలోని తుమృకోట, రెంటచింతల, పాలువాయిగేటు, రెంటాల, జెట్టిపాలెం గ్రామాలలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఆరా తీశారు. ఆయా ఘటనల్లో నిందితులుగా ఉన్న వారు స్వచ్ఛందంగా లొంగిపోయి, గ్రామాలలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని అడిషనల్ ఎస్పీ రమణమూర్తి కోరారు. సిట్ బృందం తాడిపత్రిలో కూడా విచారించింది. ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ వి.భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్‌లు తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కేసుల గురించి ఆరా తీశారు. డీఐజీ షిమోసీ వాజ్‌పాయ్‌తో మాట్లాడిన తర్వాత స్థానిక పోలీసులతో కలసి తాడిపత్రిలో అల్లర్లు జరిగిన ఓంశాంతి నగర్, టీడీపీ నేత సూర్యముని నివాసం, జూనియర్ కళాశాల మైదానం, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసం, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం తదితర ప్రాంతాలను పరిశీలించారు.

ఎయిర్‌పోర్ట్‌లో సీఎం జగన్‌ను అడ్డుకునేందుకు కుట్ర

- గన్నవరం విమానాశ్రయంలో టీడీపీ సానుభూతిపరుడి అరెస్టు
- అమెరికా పౌరసత్వం కలిగిన డాక్టర్ లోకేశ్‌బాబుగా గుర్తింపు
- విదేశాలకు వెళ్తున్న సీఎంను అడ్డుకొనేందుకు వచ్చినట్లు విచారణలో వెల్లడి
- ఆయన సెల్‌ఫోన్‌లో సీఎం పర్యటన మెసేజ్‌లు కవరేజీ కోసం ఎల్లో మీడియాకు వినతి
- సీఎం జగన్ విదేశీ పర్యటనపై చానళ్లలో లోకేశ్‌బాబు వ్యతిరేక వ్యాఖ్యలు


పోలీసుల అదుపులో లోకేశ్‌బాబు

విమానాశ్రయం (గన్నవరం): విదేశీ పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గన్నవరం విమానాశ్రయంలో అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు కుట్ర పన్నడం కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి సీఎం జగన్ విదేశీ పర్యటనకు బయల్దేరేముందు ఎయిర్‌పోర్టులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆయన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కుట్ర విఫలమైంది. టీడీపీ సానుభూతిపరుడైన ఆయన్ని అమెరికా పౌరసత్వం కలిగిన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంకు చెందిన డాక్టర్ ఉయ్యూరు లోకేశ్‌బాబుగా పోలీసులు గుర్తించారు.

వివరాలిలా ఉన్నాయి.. లండన్ పర్యటనకు వెళ్లేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్న సందర్భంగా పోలీసులు ముందస్తు భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆ సమయంలో ఇంటర్నేషనల్ టెర్మినల్ పార్కింగ్ ఏరియాలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న డాక్టర్ ఉయ్యూరు లోకేష్‌బాబును గుర్తించారు. ఆయన సెల్‌ఫోన్ నుంచి సీఎం పర్యటనకు సంబంధించిన మేసెజ్‌లను పంపినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఈ విషయమై ఆయన్ని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని గన్నవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విదేశాలకు వెళ్తున్న సీఎంను విమానాశ్రయంలో అడ్డుకునేందుకు అతను వచ్చినట్టుగా పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల ఎల్లో మీడియాకు చెందిన పలు ఛానళ్లలో జరిగిన చర్చల్లో కూడా లోకేశ్‌బాబు పాల్గొని సీఎం వైఎస్ జగన్ లండన్ పర్యటనపై వివాదాస్పద వ్యాఖ్యాలు చేశారు. పోలీసులు విచారిస్తున్న సమయంలో ఛాతీలో నొప్పిగా ఉందని చెప్ప డంతో ఆయన్ని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. ఆయనకు 41ఎ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

టీడీపీ నేతలు, ఎల్లో మీడియాకు ముందస్తు సమాచారం

ఎయిర్‌పోర్ట్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్నట్లుగా డాక్టర్ లోకేశ్‌బాబు ముందుగానే టీడీపీ నేతలకు, ఎల్లో మీడియా ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. సీఎం లండన్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు టీడీపీ నేతలు కూడా ఎయిర్‌పోర్ట్‌కు రావాలని వాట్సాప్ గ్రూపులో సందేశాలు పంపించారు. ఈ సంఘటనను ఎల్లో మీడియా ప్రసారం చేయాలని ఆయన కోరినట్లు సమాచారం. టీడీపీ సానుభూతిపరుడైన లోకేశ్ బాబు ఎన్నికలకు ముందు స్వదేశానికి వచ్చినట్లు తెలిసింది. నిత్యం సోషల్ మీడియా, ఎల్లో మీడియా వేదికగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఆయన విషం కక్కుతున్నారు. ఇదిలా ఉండగా విజయవాడలో లోకేశ్‌బాబును టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ పార్టీకి చెందిన ఇతర నేతలు కలిశారు.


జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మం జిల్లాకు చెందిన భక్తులు శనివారం విరాళం అందచేశారు. సత్తుపల్లి మండలం రేచర్లకు చెందిన కొప్పుల రాఘవరెడ్డి - సత్యవతి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు 'ఉపాధి' చేయూత



అశ్వాపురం: పండ్ల తోటలు సాగు చేయాలనుకునే రైతులకు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి జరగనున్నందున సద్వినియోగం చేసుకోవాలని అశ్వాపురం ఎంపీడీఓ వరప్రసాద్ సూచించారు. మామిడి, జామ, తైవాన్‌జామ, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి, సపోటా, జీడిమామిడి, కొబ్బరి, సీతాఫలం తోపాటు ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశముందని తెలిపారు. ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖ, ఐటీడీఏ ద్వారా సాగు ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. మొక్కల కొనుగోలుతో పాటు గొయ్యిలు తీయడం, మొక్క నాటడం పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేయిస్తారని, మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఉపాధి హామీ ద్వారా అందుతాయని తెలిపారు. అలాగే, ఉద్యాన, వ్యవసాయశాఖలు, ఐటీడీఏ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ఏర్పాటుచేసుకుంటే నీటి వినియోగం తగ్గుతుందని వెల్లడించారు. ఒక్కో రైతు ఎకరం నుంచి ఐదెకరాల వరకు పథకాలు వర్తిస్తాయని, పూర్తి సబ్సిడీపై అందే ఈ పథకం కోసం రైతులు ఉపాధి హామీ సిబ్బంది లేదా గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు. కాగా, పండ్ల తోటలు నాటాక మూడు, నాలుగేళ్ల తర్వాత ఎకరం తోటకు ఏటా రూ.2 లక్షల పైబడి ఆదాయం వస్తుందని తెలిపారు.

గ్రామీణ రైతుల ఆధునిక సేద్యం

- ఇప్పటికే వ్యవసాయ యాంత్రీకరణ
- ప్రస్తుతం పెరుగుతున్న డ్రోన్ల వినియోగం
- సులువవుతున్న పురుగు మందుల పిచికారీ


వరిపంటపై డ్రోన్ స్ప్రేయర్‌తో మందుల పిచికారీ (ఫైల్)

బూర్గంపాడు / చండ్రుగొండ: గ్రామీణ ప్రాంత రైతులు సంప్రదాయ విధానాలను పాటిస్తూనే వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికే దుక్కులు, దమ్ములు, పంటల్లో పాటుచేయడం వంటి పనులకు యంత్రాల వినియోగం పెరిగింది. ఆపై పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ కోసం మందుల పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించేందుకు మక్కువ చూపుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు డ్రోన్లతో వరి, ఆయిల్‌పామ్ పంటల్లో మందులు పిచికారీ చేస్తుండగా మంచి ఫలితాలు రావడంతో ఇతరులు కూడా ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానంలో సమయం ఆదా కావడంతోపాటు కూలీల కొరతను అధిగమించవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఐదేళ్ల క్రితమే ఆరంభం

రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలు సాగవుతాయి. ఆయిల్‌పామ్ సాగు జిల్లా పెట్టింది పేరు కాగా.. ఇతర వాణిజ్య పంటలు కూడా సాగవుతున్నాయి. ఈ నేపథ్యాన ఐదేళ్ల క్రితమే పలువురు రైతులు డ్రోన్ల ద్వారా మందుల పిచికారీని ప్రారంభించారు. తొలినాళ్లలో ఇతర రైతులు పెద్దగా ఆసక్తి చూపించకున్నా గత రెండేళ్లుగా మాత్రం కాస్త స్థోమత ఉన్న రైతులు డ్రోన్ల వినియోగంపై మక్కువ కనబరుస్తున్నారు.

చకచకా.. ఖర్చు తక్కువ

రైతులు పంటలపై మందుల పిచికారీకి హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లను వినియోగిస్తున్నారు. వీటితో మందులు పిచికారీ చేయాలంటే కూలీల అవసరం తప్పనిసరి. ప్రస్తుతం కూలీల కొరత ఉండడతో పంటలను నష్టపోవాల్సి వస్తోంది. మరోపక్క వీటి ద్వారా మందుల పిచికారీతో విష ప్రభావం రైతులు, కూలీలపై పడుతోంది. దీంతో ట్రాక్టర్లకు పెద్ద స్ప్రేయర్లు బిగించి మందులు పిచికారీ చేసినా పత్తి మొక్కలను నష్టపోతున్నారు. ఇక వరి, మిర్చి, పెసర, మినుము, శనగ, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయల పంటలలో ట్రాక్టర్లతో స్ప్రే చేయడం సాధ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు డ్రోన్లు ఆశాకిరణంగా మారాయి. రెండేళ్లుగా వీటి వాడకం పెరగగా ఇప్పుడిప్పుడే గ్రామాల్లోనూ వినియోగం మొదలవుతోంది. కొందరు నేరుగా కొనుగోలు చేస్తుండగా.. ఇంకొందరు పురుగు మందుల కంపెనీల నుంచి అద్దెకు డ్రోన్లు తెచ్చుకుంటున్నారు. తద్వారా వ్యయం తగ్గడంతోపాటు సమయం కలిసొస్తుందని చెబుతున్నారు.


పామాయిల్ తోటలో మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

డ్రోన్‌కు కెమెరా కూడా...

కెమెరా అమర్చి ఉండే అగ్రికల్చర్ డ్రోన్ స్ప్రేయర్ బ్యాటరీలతో నడుస్తుంది. రిమోట్ కంట్రోల్‌తో దీనిని నియంత్రిస్తూ కేవలం పది నిమిషాల్లోనే ఎకరం పంటపై పురుగు మందులు పిచికారీ చేయొచ్చు. డ్రోన్ స్ప్రేయర్‌కు పది లీటర్ల ట్యాంక్ ఉండగా.. బ్యాటరీతో కలిపి స్ప్రేయర్ బరువు 13 కిలోల వరకు బరువు ఉంటుంది. ప్రతీ ఎకరం పొలంలో పిచికారీ అనంతరం బ్యాటరీ మార్చుకోవాల్సి ఉంటుంది. కాగా, స్ప్రేయర్‌కు ఉండే కెమెరా ఆధారంగా పిచికారీ సమపాళ్లలో జరిగేలా పర్యవేక్షించే అవకాశముండడంతో పని సులవవుతోంది. కాగా, ప్రభుత్వం అగ్రికల్చర్ డ్రోన్ స్ప్రేయర్లను రాయితీపై అందించి ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

మంచి ఫలితం కన్పించింది...



డ్రోన్ వినియోగించి పంటలపై పురుగుల మందు పిచికారీ చేయడంతో మంచి ఫలితం కనిపించింది. సగానికి సగం పురుగుల మందు ఆదా అయింది. ఒక ఎకరాకు 90 గ్రాములు పట్టాల్సిన మందు 50 గ్రాములతోనే సరిపోయింది. ఇది రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– నరుకుళ్ల అప్పారావు, రైతు, అయన్నపాలెం

ఇబ్బందులు చూడలేక తీసుకొచ్చా..



పంటల్లో మందుల పిచికారీ చేసేందుకు కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్వతహాగా రైతు అయిన నేను అందరికీ ఉపయోగంగా ఉంటుందని డ్రోన్ తీసుకొచ్చా. డ్రోన్ వినియోగంతో సమయం, మందు, నగదు ఆదా అవుతాయి.

– జిల్లెళ్ల రాము, రైతు, దామరచర్ల

వ్యవసాయ కూలీలకు సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న వెంకట్

సింగరేణి(కొత్తగూడెం): వ్యవసాయ కూలీలకు మొదటి ప్రాధాన్యతగా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. దేశంలో పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజురోజుకూ పేదరికం పెరిగిపోతోందని తెలిపారు. ఈ నేపథ్యాన ఏ ఆధారం లేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సాగుభూమి లేని నిరుపేదలకు స్థలం ఇవ్వాలని ఆయన కోరారు. కాగా, ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడంతో పాటు రోజుకు రూ.600 కూలి ఇచ్చేలా ఉద్యమాలు ఉధృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో యూనివర్సిటీ స్థాపించాలి


- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నకు మద్దతు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ, లక్ష్మణ్


మాట్లాడుతున్న పుట్టా లక్ష్మణ్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యా గుమ్మంగా భాసిల్లుతున్న ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్టా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో పేరున్న ఖమ్మంపై ఆది నుంచి పాలకవర్గాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని విమర్శించారు. బీజేపీ విద్యను కాషాయీకరణ చేసేందుకు యతిస్తూ నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకురాగా తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఏఐఎస్ఎఫ్ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. విద్యాసంవత్సరం సమీపిస్తున్న నేపథ్యాన ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణపై దృష్టి సారించాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నియామకాలు చేపట్టి వసతులను కల్పించాలని మణికంఠ, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో టెట్ కేంద్రాల కేటాయింపులో అభ్యర్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఇటికాల రామకృష్ణ, సతుకు ప్రవీణ్, మడుపల్లి లక్ష్మణ్, వెంకటేశ్, మధు, శివ, చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుతో ఆరోగ్యానికి ముప్పు

ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు


కరపత్రాలను విడుదల చేస్తున్న గిరిసింహారావు, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ నలుగురిలో ఒకరికి బీపీ ఉందని, రక్తపోటుకు కారణం ఉప్పు అధిక వినియోగమేనని ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'రక్తపోటు – ఒక అవగాహన'పేరిట రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గిరిసింహారావు మాట్లాడుతూ.. ప్రతీ నలుగురిలో ఒకరికి బీపీ ఉండగా.. క్రమం తప్పని వ్యాయామం, బరువు తగ్గించుకోవడం, యోగా, ధ్యానం, ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడం ద్వారా బీపీని నియంత్రించుకోవచ్చని తెలిపారు. 'సాల్ట్ సత్యాగ్రహ'నినాదంతో అందరూ రోజుకు ఐదు గ్రాముల కంటే తక్కువ ఉప్పు వాడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేనేం చేయాలో మీరు చెబుతారా?

విద్యుత్ ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశారని రైతుల నిరసన


రైతులను సముదాయిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: విద్యుత్ సమస్యను వివరించేందుకు వెళ్లిన తమను ఏఈ అవమానించారని పేర్కొంటూ రైతులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రాజేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మోటాపురానికి చెందిన రైతు బాగం మురళి శనివారం వెళ్లి ఏఈ మురళిని కలిశాడు. తమ విద్యుత్ లైన్‌కు ఎక్కువ కనెక్షన్లు ఇస్తుండటంతో సమస్య వస్తోందని, ఒకవేళ కొత్త కనెక్షన్లు తప్పనిసరైతే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. దీంతో ఏఈ 'నా విధులు మీరు చెబుతారా' అని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని వివాదానికి దారితీసింది. దీంతో ఆఫీస్ నుంచి బయటకు వెళ్లిపో అన్నారని రైతు ఆవేదన వ్యక్తం చేయగా మరికొందరు రైతులు చేరుకుని సబ్‌స్టేషన్ గేట్ మూసివేసి నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని రైతులతో చర్చించగా ఆందోళన విరమించారు. ఈ విషయమై ఏఈ బాలాజీని వివరణ కోరగా వ్యక్తిగత తగాదాలతో ఇతర రైతులకు కనెక్షన్ ఇవ్వొద్దని చెప్పగా తమ విధులు కూడా మీరే చెబుతారా అని ప్రశ్నించానే తప్ప తాను రైతులను అవమానించలేదని తెలిపారు.